# అడుగడుగునా అపూర్వ స్వాగతం

- మండలంలో ఎమ్మెల్యే హరిప్రియ విస్తృత ప్రచారం..
- స్థానిక మహిళలతో కలిసి గ్రామాల్లో కోలాటం..



ప్రచారంలో భాగంగా కోలాటం వేస్తున్న హరిప్రియనాయక్

టేకులపల్లి, అక్టోబర్ 28 :ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించారు. అన్ని గ్రామాల్లో ఆమెకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక



మహిళలతో కలిసి కోలాటం వేశారు. తొలుత గంగారం గ్రామ పంచాయతీ సంపత్‌నగర్ వేంకటేశ్వరాస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చింతోనిచెలక, మేలమడుగు, చింతోనిచెలక తండా, గంగారం, రోడ్డుగుంపు, లచ్చగూడెం, టేకులగుంపు, ఒడ్డుగూడెం, కిష్టా రం, కొప్పురాయి, దారపాడు, ఒడ్డుగూడెం, ఇప్పలచెలక, రాజారాంతండా, బర్లగూడెం, మోట్లగూడెం, జంగలపల్లి తదితర గ్రామాల్లో మహిళలు ఆమెపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె వారితో కోలాటం ఆడి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ మరింత అభివృద్ధి కోసం ఈ ఎన్నికల్లో తనకు అధిక మెజార్టీ అందించాలని కోరారు.

# సీఎం సభకు వేలాదిగా జనసమీకరణ

### ఇల్లెందు పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ



ఇల్లెందు రూరల్, అక్టోబర్ 28: నవంబర్ 1న ఇల్లెందులో జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వేలాదిగా జనసమీకరణ చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ తెలిపారు. ఈ సభకు తరలివచ్చేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇల్లెందులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. వాటికి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, దీంతో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని వివరించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఇతర రాష్ట్రాల్లో మంచి స్పందన ఉందని, తమకూ ఇలాంటి పథకాలు కావాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దేశంలో రైతుబంధు ప్రవేశపెట్టి అన్నదాతలను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కోతలులేని కరెంటును నిరంతరం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. పేదలకు సన్నబియ్యం సరఫరా, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ పెంపు, ఆసరా పింఛన్లు రూ.5 వేలకు పెంపు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంపు, రైతుబంధు రూ.16 వేలకు పెంపు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ స్కూళ్లు, అర్హులైన పేదలకు రూ.5 లక్షల బీమా, రూ.400కే వంట గ్యాస్, అర్హులైన పేద మహిళలకు రూ.3 వేల గౌరవ భృతి వంటివన్నీ మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్ అమలు చేస్తారని వివరించారు. అందుకని మండల ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియను గెలిపించాలని కోరారు. అలాగే, వచ్చే నెల 1న ఇల్లెందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి వేలాదిమంది తరలిరావాలని కోరారు.

# ఉద్యోగుల ఆరోగ్య రక్షణే ప్రథమ కర్తవ్యం


### సింగరేణి ఇల్లెందు ఏరియా రక్షణ పక్షోత్సవాల కన్వీనర్ వెంకటేశ్వరరావు



బహుమతులు అందజేస్తున్న కన్వీనర్ వెంకటేశ్వరరావు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 28: ఉద్యోగుల ఆరోగ్య రక్షణే సంస్థ ప్రథమ కర్తవ్యమని సింగరేణి ఇల్లెందు ఏరియా రక్షణ పక్షోత్సవాల కన్వీనర్ కే.వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం విషయంలో సంస్థ మరిన్ని జాగ్రత్తలు తీసుకొచ్చిందని అన్నారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో కలిసి శనివారం ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి ఆరోగ్యపరమైన రికార్డులను సులభంగా తెలుసుకునేందుకు సింగరేణి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అనే అప్లికేషన్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ యాప్‌పై ఆసుపత్రి సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో బెడ్లు, రక్త పరీక్ష, ఎక్స్‌రే గదులు, పీఎంఈ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పీ.శ్రీనివాసు, పీ.రమేశ్‌బాబు, పీ.హరిశంకర్, డాక్టర్లు శేషగిరిరావు, ఎస్.మల్లారెడ్డి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతానికి ఇంటి సామగ్రి దగ్ధం



ఇల్లెందు రూరల్, అక్టోబర్ 28: విద్యుదాఘాతానికి ఇంట్లోని సామాన్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పోలారం గ్రామానికి చెందిన వెంకన్నగౌడ్ ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. పని నిమిత్తం కుటుంబసభ్యులు బయటకు వెళ్లొచ్చిన సమయంలో విద్యుదాఘాతం జరిగి ఇంట్లో ఉన్న టీవీతోపాటు మరికొన్ని వస్తువులు కాలిపోయాయి. కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి అన్నీ కాలిపోయి ఉన్నాయి.

## బీఆర్ఎస్‌పై ప్రజలకు పూర్తి భరోసా

### పార్టీలో భారీ చేరికలే ఇందుకు నిదర్శనం

### బీఆర్ఎస్ వైరా అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

కారేపల్లి, అక్టోబర్ 28: బీఆర్ఎస్‌పై ప్రజలకు పూర్తి భరోసా ఉందని ఆ పార్టీ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. పార్టీలో జరుగుతున్న చేరికలే ఇందుకు నిదర్శనమని అన్నారు. అందుకే ప్రతి రోజూ గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు వచ్చి పార్టీలో చేరుతున్నారని అన్నారు. మండలంలోని సామ్యతండాలో వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాల వారు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మదన్‌లాల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

## నలమాస్ తేజం స్తూపం నిర్మాణానికి శంకుస్థాపన



టేకులపల్లి, అక్టోబర్ 28: సీపీఐ మండల నాయకుడు నల్లమాస్ తేజం స్తూపం నిర్మాణానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా శంకుస్థాపన చేశారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్మాణంలో ఈ గ్రామం కృషి ఎంతో ఉందని అన్నారు. తేజం ఆశయాలను సాధిస్తామని అన్నారు. పార్టీ నాయకులు గుగులోత్ రాంచందర్, అయిత నాగార్జున చారి, వెంకన్న, నర్సింహారావు, నరేందర్, శ్రీలత, గంగా లచ్చమ్మ, జానయ్య, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామగ్రామాన అమరవీరుల వర్ధంతి సభలు జరపండి'



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

టేకులపల్లి, అక్టోబర్ 28: అమరవీరుల వర్ధంతి సభల గ్రామగ్రామాన నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. మండలంలోని బోడు గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు దూబాకుల ప్రసాద్ మాట్లాడారు. భూమి, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం విప్లవోద్యమంలో మృతిచెందిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 9 వరకు వర్ధంతి సభలు జరపాలని కోరారు. నాయకులు కల్తి వెంకటేశ్వర్లు, గుగులోత్ రామచందర్, ఎట్టి నర్సింహారావు, కోటిలింగం, సిరికొండ నాగేశ్వరరావు, వెంకటమ్మ, వినోద్, సమ్మయ్య, పొట్టయ్య, వెంకటరామ్, రవి పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

టేకులపల్లి, అక్టోబర్ 28: ఇంటర్ చదువుతున్న ఓ బాలిక అదృశ్యమైన ఘటనపై టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. కాలేజీకి వెళ్లొస్తానంటూ శనివారం ఉదయం 8 గంటలకు ఇంటి వద్ద నుంచి వెళ్లింది. సాయంత్రం 4:30 గంటలు దాటినా ఇంటికి రాలేదు. దీంతో ఆమె తండ్రి కాలేజీకి వెళ్లి అడుగగా ఈ రోజు ఆ బాలిక కాలేజీకి రాలేదని కాలేజీ బాధ్యులు తెలిపారు. దీంతో అతడు తన కుమార్తె స్నేహితుల ఇంటికి, బంధువుల ఇంటికి వెళ్లి వెతికినా అక్కడ కూడా ఆమె ఆచూకీ లేదు. దీంతో సుక్కలబోడు గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందంటూ బాలిక తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

## హరిప్రియానాయక్ విజయం ఖాయం: బీఆర్ఎస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు మల్సూర్, కవిత

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 28: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియా నాయక్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు మల్సూర్, కవిత అన్నారు. మండలంలోని పోలారం గ్రామ పంచాయతీలో ఆరుగురితో గ్రామ కమిటీ వేశారు. వీరంతా కలిసి శనివారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరిప్రియానాయక్ కూడా గ్రామానికి వచ్చి గడపగడపకూ వెళ్లి ప్రతి ఒక్కరినీ కలుసుకుంటారని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గురించి వివరిస్తారని అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు మరోసారి గెలిస్తే అమలుచేయబోయే మ్యానిఫెస్టోను కూడా వివరిస్తారని అన్నారు. అలాగే, నవంబర్ 1న ఇల్లెందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పోలారం గ్రామ పంచాయతీ నుంచి 1500 మంది ప్రజలు రావాలని కోరారు. కమిటీలోని మల్సూర్, కవిత, సతీశ్, నాగేశ్, వినోద్, పృథ్వీలతోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.